
# చిక్కుముళ్ళు



బ్రహ్మం తలుచుకుంటే కట్టు గొయ్యాకు కల్యాణం జరిపించగలడు. మా తాలూకాలో అతనిపేరు పెళ్ళికాని పిల్లలున్న ప్రతిచెట్టుకీ, పుట్టకీ కూడా తెల్సు. పెళ్ళి కావలసిన అబ్బాయిలు - అమ్మాయిలు, వాళ్ళ పేర్లు - గోత్రాలూ, అసలు వయసులూ - నకిలీ సొగసులూ, ఆస్తులూ - దావాలు, పసుపులు - లొసుగులు, అలవాట్లు - పొరపాట్లు వగైరా వివరాలన్నీ అతని బుర్రలో అశోకుడి శిలాశాసనాల్లా భద్రంగా ఉంటాయి.

బ్రహ్మం కన్ను తెరిస్తే కాకికి కల్యాణ ఘడియ లొస్తాయి.

కన్ను మూస్తే తాళిబొట్టు త్రాచుపామై పెళ్ళాగి పోతుంది.

ఆ చేత్తో తాడు కట్టించగలడు. ఈ చేత్తో విడాకు లిప్పించగలడు. ఉన్న పెళ్ళాన్ని చంపించగలడు. రెండో దాన్ని చూపించగలడు.

అరవయ్యేళ్ళ వాడికి ఆషాఢంలో పెళ్ళి జరిపించగలడు. శిల గొరిగించి తలంబ్రాలు పోయించగల సామర్థ్యం ఉందతనికి!

'దేవుడికి పుట్టించే శక్తితోపాటు గిట్టించే యుక్తి ఉందబట్టే ఈ నరులు మాటింటున్నారు. లేకపోతే కొబ్బరికాయ కొట్టమంటే దేవుణ్ణే కొనుక్కొచ్చుకోమనరూ' అంటాడు బ్రహ్మం.

సహజంగా సంబంధాలు తలపెట్టుకున్న వాళ్ళంతా దూరాలనుంచి వచ్చి ఊరదేవతకు కొట్టినట్టు బ్రహ్మానికి ఓ కొబ్బరికాయ కొట్టి

చంద్ర సుబ్బారావు

పోతుంటారు. 'అవసరమైతే ఓ చెయ్యి వెయ్యి దేవుడా' అనీ కావొచ్చు. 'దేవుడా ఈ సంబంధంలో వేలుపెట్టకు. మమ్మల్నిలా వదిలెయ్' అనీ కావొచ్చు.

'అంతేకాని-నీ వెంట'ని బ్రహ్మాన్ని తృణీకరించి కల్యాణం తలపెట్టినవాడు లేడు. ఉన్నా, వాడికీ జన్మలో పెళ్ళికాదు. బ్రహ్మానికి 'బోకరేజి' యివ్వాలని కక్కుర్తిపడి, కొట్టు శివయ్య ఇలాగే మట్టి కొట్టుకుపోయాడు. వాడి కొడుక్కి వచ్చే సంబంధం, పోయే సంబంధం. పాపం ఆ పిల్లాడు కాసింత సన్నంగాని బాగానే వుంటాడు. బుద్ధిమంతుడు కూడా.

'ఏవయ్యా శివయ్యా పప్పన్నం ఎప్పుడూ' అని కొట్టుకు వచ్చిన వాళ్ళడిగితే.

'బ్రహ్మం కాలం చేసినప్పుడు.' అంటాడు శివయ్య!

'చొచ్చొచ్చొ' అనుకుని వెళ్ళిపోతుంటారు జనం! శివయ్యమీద జాలి కలక్కపోలేదు జనంలో. బ్రహ్మంతో అవసరం కలక్కపోదు కదా. ఈ విషయంలో ఖండించిన వాడి జుట్టు ఎప్పుడు బ్రహ్మానికి దొరుకుతుందో నన్న భయం!

* * *

నేను మా మరదలు లలిత పెళ్ళి విషయం బ్రహ్మానికే వదిలివేయ దలుచుకున్నాను. మామూలు పెళ్ళిళ్ళు జరగటమే కష్టం. ఇహ లలితలాగా కాసింత 'లొసుగు' కనిపిస్తే ఆ పెళ్ళికి చెరువుల నీళ్ళు త్రాగాల్సిందే. నేనా నోట్లో నాలికలేని వాణ్ణి. 'కూరగాయలు సరిగ్గా తుయ్యమని అడగలేను. ఇంకా ఆడకూతురు పెళ్ళి ఏం చేయగలను?' అనుకుని బ్రహ్మం దగ్గరకు పోయాను.

బ్రహ్మం సాదరంగా ఆహ్వానించి, చాపేసి కూర్చోబెట్టి 'కాసిని మంచి మజ్జిగ పట్రామ్మా' అని వాళ్ళమ్మాయికి చెప్పాడు.

'మజ్జిగెందుకు బాబాయ్-మంచినీళ్ళు చాలు' అన్నాను.

'పెళ్ళి పెద్దలకు లాంఛనాలుంటాయి. వాళ్ళడిగేవి కొన్ని. మనం ఇచ్చేవి కొన్ని. మాటవరసకు నువ్వు బత్తాయి రసం ఇమ్మంటే నేను యివ్వలేను. నీవు నీళ్ళివ్వమన్నా నేను పాలు-ఫలహారం పెట్టొచ్చు....'

బ్రహ్మం జేబులోనుంచి పొగాకుకాడ తీసి, నా వంక అదోలా చూసాడు.

'నేను పెళ్ళి పెద్దనని మీకు చెప్పలేదే....' ఆయన తెలివి కాశ్చర్యపోతూ అన్నాను.

'ఓస్-ఓస్ - నివ్వెవరవో, ఎందుకొచ్చావో తెలియకపోతే నేనింకా కల్యాణాలేం జరిపిస్తాను. కానుకలేం పుచ్చుకుంటాను. అసలు అబ్బాయ్—నీవు నాకు పరాయివాడివా—మజ్జిగిచ్చానా మంచినీళ్ళిచ్చానా అన్నది మూణ్ణిద్రలు అయ్యాక తీరిగ్గా కూచుని లెక్కేసుకోవాల. ఈ సమయంలో ఉండాల్సింది తెగింపు. అర్ధమయిందా ...'

బ్రహ్మం చిలక్కి చెప్పినట్లు చెప్పాడు.

నాకేమిటర్ధమవుతుంది. ఏనుగుముందు ఎలికలా కూర్చుని, గీతాపారాయణం వింటున్నానే కాని బ్రహ్మం కల్యాణ జ్ఞానం నాబోటి పామరుడికేం ఎక్కుతుంది?

పెళ్ళి విషయం ఎలా ఎత్తాలో తెలియలేదు. అందుకని, ఏదో కల్యాణపు తంతులగూర్చి మాట్లాడుతుంటే మధ్యలో మా లలిత గూర్చి అడక్కపోతాడా అనుకుంటూ.

'బాబాయ్, అసలు పెళ్ళంటే ఏమిటి?' అన్నాను, 'నాన్నా నేనెలా పుట్టాను' అనే పిల్లాడి ప్రశ్నలా.

బ్రహ్మం తడువుకోవండా 'కనికట్టు' అన్నాడు.

ఓరి తస్సాగొయ్యా-ఇదేదో ఆధ్యాత్మిక చింతనలు ఆఖరిమెట్టులా వుందనిపించి . .మరి కాస్త తరిచి చూద్దామని....

'ఎట్లా! కనికట్టా' అన్నాను.

బ్రహ్మం మజ్జిగ గ్లాసు లోపల పెట్టించి చుట్ట ముట్టించాడు. 'చూడు బాబూ, నీవు త్రాగవని నీకు చుట్ట యివ్వటంలేదు కాని, దీని దుంపతెగ-ఈ గుంటూరు పొగాకుంది చూసావె కాబోయే వియ్యంకుడికి ఓ కట్ట పంపిస్తే లక్ష

కట్నం క్రింద భావిస్తాడు. ఈ చిల్లరమల్లర మర్యాదలున్నాయే - మహా గొప్ప కార్యాలు సాధిస్తాయయ్యా. మన పిచ్చి జనానికి వందేలు కట్నం తగ్గినా పర్వాలేదు. విడిదింటికి పానకం పంపించారా లేదా అన్నది ముఖ్యం. '

మాట ప్రక్కదారికి మళ్ళించేమోనను కుంటూ 'నేనడిగిందీ' అన్నాను.

'నివ్వడిగింది నాకు గుర్తుందిలే.' శుభ కార్యాల్లో చిట్కా ఏమిటంటే నివ్వడిగింది నేను చెప్పకూడదు. అబ్బాయి తరఫువాళ్ళు ఆస్తి అడిగితే అమ్మాయి అందం గూర్చి చెప్పాల. వాళ్ళు అందం గూర్చి గట్టిగా లాగితే అమ్మాయి ఆస్తివాటా ఎంతో తెలియపరచాల. అబ్బాయి స్కూలు ఫైనలు తప్పాడనకూడదు. పది ప్యాసయ్యాడనాల. కాదు కూడదు రిజిష్ట్రీ చూపించమంటే మా కోడలు పెట్టిలో వుంది. ఆ పిల్ల పుట్టింటికెళ్ళింది. లగ్నాలనాడు చూద్దురుగాని అని సర్దుకోవాల . . చూడు అబ్బాయ్—'

'అర్థమైంది' అన్నాను అల్పసంతోషిలా.

'ఏమిటర్థమైంది. అర్థమయితే నీ మరదలు పెళ్ళి ఎప్పుడో చెయ్యవూ - ఇందాకనా-' చుట్ట బాగ నా ముఖంమీద ఊదుతూ—అన్నాడు బ్రహ్మం.

నా మనసు మాటల్లోను, ముఖం పొగలోను ఉక్కిరిబిక్కిరయ్యాయి. దగ్గొచ్చింది. దగ్గులో కలిసిపోయింది, కాని అప్పుడు నా ముఖంలో కోతులు కనిపించాయేమో!

'అసలు విషయం ఇట్టా పట్టేసేదే' అను కుని 'నీకు తెలియందేముంది బాబాయ్, చూసా వుగా-దానిమీద ఎంత మచ్చొచ్చిందో—ఇంకా పెళ్లెట్టా అవుద్ది చెప్పు.' బ్రహ్మం ఆప్యా యతగా నా చెవిదగ్గరకొచ్చి—

'పిచ్చోడా-ఇంతకాలం నా దగ్గర కెందుకు రాలేదా అనుకుంటున్నాను. ఇదా సంశయం. ఓస్సి. చందమామలో మచ్చలేదూ - ఎవడో ఓ నూలుపోగు గాడురాడూ-అసలు చందమామ గుణం ఏమిటో గ్రహించావా—?

ఏమిటన్నట్లు చూసాను.

'గ్రహించలేదూ - ఇవ్వాళ చూడు చంద మామని. మళ్ళీ రేపుచూడు. నీకే తెలుస్తది ' గుప్పెట్లో ఉన్నది గునపం అన్నట్లు చెప్పాడు బ్రహ్మం!

'దాందేముంది-అమాసనాడు చందమామ ఏడుంటాడు' అన్నాను అదే పక్కీలో—

'అదగదీ, నీకూ నాకూ తేడా. పవుర్ణమినాడు పెళ్ళిచేసే బాధ్యత నా కొదిలెయ్. నీ మరదలైతే ఒకటీ, నా కూతురైతే ఒకటీనా—' చుట్టపళ్ళ క్రింద బిగిస్తూ అన్నాడు బ్రహ్మం.

బ్రహ్మం తలపెడితే అది జరిగి తీరుతుంది. తృణమో, పణమో ఆశించవచ్చు. మనది అవ సరం. అతనిది వ్యాపారం. అసలు తలపెట్టాడా లేదా అని చూసుకోవటం ముఖ్యం. బ్రహ్మానికి పెళ్ళిళ్ళంటే గిత్తల బేరాల క్రింద లెక్క. ఎటొచ్చీ 'సంభావన' గురించి అతనికీ మనకీ అపార్థాలుంటే ఆ పెళ్ళి కాళ్ళగోళ్ళ దగ్గర ఆగుతుందో, కార్యంగదిలో ఆగుతుందో చెప్ప లేం. అంచేత ఆ ముక్క నిశ్చయించుకుంటే బ్రహ్మంతో మామూలుగా పేచీలేదు. (అతనికి నీ మీద ఏదైనా వెనకటి గుర్రుంటే తప్ప!) అది కూడా తేల్చుకుందామని,

'ఆ మూడు ముళ్ళూ వేయించు బాబాయ్ దానికి. నీ ఋణం ఉంచుకోను' అన్నాను. అంతె చెప్పినంత ముఖంలో.

'నీ ఋణం తగలడ, నీ కిష్టమైతే ఓ కప్పు కాఫీ పొరెయ్. నీ పందిట్లో దివిటీ పట్టుకుని నిలబడతాను. కావలసింది పెళ్ళి-సరేనా—

'సరే.'


'అన్నట్టు రేపు కనిపించు' అన్నాడు.

లేచి పైపంచె భుజాన వేసుకుని బయలు దేరాను.

'కందులు విసరటం మొదలెట్టమను' అని కేకేసాడు. బ్రహ్మం భాషలో అది పెళ్ళికి నాంది!

* * *

రెండో రోజు కాలవ కట్టమీద ప్రక్క ప్రక్కన నడుస్తున్నాం. కాలవనీళ్ళలా ప్రవాం




తంగా ఉంది బ్రహ్మం ముఖం. ఏం చెబుతాడో అని నీళ్ళలో చేపలా కొట్టుకుంది నా మనస్సు.

'ఈ పెళ్ళిళ్ళున్నాయి చూసావ్-' బ్రహ్మం మొదలెట్టాడు.

' . అన్నీ చిక్కుముళ్ళయ్యా. జాగర త్తగా లాక్కోవాల. ఓపిక లేకపోతే ఒట్టిదే. అవుతుం దనుకున్న పెళ్ళి కాకపోవచ్చు. మాచికమ్మ కిల్లాణం కుక్కలా బయటకు రావచ్చు.'

'వెయ్యి అబద్ధాలాడి ఓ పెళ్ళి చెయ్య మన్నారు గదా పెద్దలు' అన్నాను. పెళ్ళిళ్ళ గూర్చి నాకు తెలిసిన ఒక్కమాట బయటపెట్టే కిరిలో.

'ఎడ్చినట్టుంది' అన్నాడు బ్రహ్మం.

నాకు సిగ్గేసిపోయింది. నాటకంలో చచ్చిన పాత్రకు 'వన్స్‌మోర్'. అంటే చుట్టూవున్న వాళ్ళు నవ్వినట్లు అనిపించింది.

'తెలివితక్కువ వెధవలు అనుండాలి. పెళ్ళికి వెయ్యి అబద్ధాలాడాలేమిటీ.. ' బ్రహ్మం వెల గని చుట్ట కాలవలో పారేసాడు.

అక్కర్లేదా అన్నట్లు చూసాను.

'చూడూ-నా సర్వీసులో నేను వందల పెళ్ళిళ్ళు జరిపించాను. పట్టుమని పది అబద్ధా లైనా ఆడలేదు. అసలు అబద్ధం ఎందుకయ్యా. అబద్ధం, నిజం అని రెండు మాటల్లేవు. అవి రెండూ రూపాయి బిళ్ళకు రెండు పక్కలు. మాట వరసకు చెబుతున్నాను. ..

పెళ్ళికొడుకు భవంతిలో ఉంటాడు అంటే ...అది భవంతి కావొచ్చు....పెరట్లో కారు షెడ్డు కావొచ్చు ..

అబ్బాయికి జీతం పన్నెండొందలుఅంటే.... ఆ జీతం నెలకో—సంవత్సరానికో చెప్పం గదా. .' మరో చుట్ట వెలిగించాడు!

నేను ఫక్కుమని నవ్వి 'తప్పుగదా బాబాయ్' అన్నాను.

'నవ్వే విషయం కాదోయ్ సన్నాసీ' అన్నట్లు నా వంక చూస్తూ.

'నా తత్వం నీకు బోధపడలేదు. తప్పా - పెళ్ళంటే ఏమిటి? ఓ పచ్చి బూతు' అన్నాడు ఉపనిషత్తులోని మాటలా. 'బూతా' అన్నాను!

'కాక మరేమిటి? పరంధామయ్య కూతురు అడ్డమైన వాళ్ళతో తిరిగి ఆర్నెల్లకో కడుపు దించింది. ఇవ్వాళ పదెకరాల కట్నం వచ్చిం దని ఓ కుంక పు స్తెకడితే పతివ్రత లాగా కాపరం చేస్తుంది. వెంకడి పెళ్ళాం లేచిపోయి పుల్లిగాణ్ణి గుళ్ళో పెళ్ళి చేసుకుంది. ఇప్పుడు వెంకడికి కాళ్ళుకడిగి కన్యాదానం చేస్తా మం టున్నారు....'

'అందరికీ అలా జరగదు కదా....!

'నేను జరిపించిన కేసులు ఆకాశంలో చుక్కలన్ని వున్నాయి. పోయి నేడు 'సుందర్రావ'ని మన పక్కూరే. తింటానికి తిండిలేదు. నెలకు యాభై రూపాయల సంపాదన! ఆళ్ళయ్యొచ్చి నా కాళ్ళమీద పడ్డాడు. మూడోనాటికి పెళ్ళి చేయించాను....'

'ఎవరితో—'

'లక్షణమైన పిల్లతో. ఆ పక్కూరు వెంకట్రామయ్య కూతురుతో-చేయవలసింది కాపరం గాని, పెళ్ళి ఎలా జరిగిందో ఎవడి క్కావాలయ్యా.. '

'అంతే నంటావా—'

'ముమ్మాటికీ అంతే. పురాణాల్లో చూట్టంలా. చేపనుకొట్టి ఒక పిల్లనీ, వేటకెళ్ళి ఒక పిల్లనీ కొట్టుకొచ్చుకునే వాళ్ళు.. .'

బ్రహ్మం సాక్షాత్తూ దేవుడిలా కనిపించాడు. 'కాళ్ళమీద పడిపోదాం' అనిపించింది కాని, కార్యం జరగనిమ్మని ఊరుకున్నాను.

'అంచేత పెళ్ళిళ్ళు జరగటం, జరక్కపోవటం నరుడి చేతిలో పని. .' బ్రహ్మం చుట్ట నిప్పు ఆరిపోయిందేమో చూసుకున్నాడు.

బ్రహ్మం సామర్థ్యం తెలియంది కాదు. ఆ శివయ్య కొడుకు పెళ్ళి ఇవాల్టికి గుమ్మంలోనే ఆగిపోయిందంటే బ్రహ్మం ఘనతే. సంబంధాల కొచ్చిన వాళ్ళని రోడ్డుమీద కలుసుకుని.

'ఏ వూరు బాబూ మనది?' అనేవాడు.

'ఏటపాలెం అండి. సంబంధం కోసం వచ్చాం. అన్నట్లు ఈ వూళ్ళో శివయ్య కొడుకని ఉన్నాట్ట. ' వాళ్ళు!

'లేకేం. మహారాజులా ఉన్నాడు.'

'ఏమండీ . . .ఏం .ఎలా వుంటాడు సుబ్రాడు!'

'సుబ్రాడు మంచాడే. బుద్ధిమంతుడే. కాకపోతే కాసింత ఉబ్బసం దగ్గు పట్టుంటది. క్షయ లాంటిదేమీ కాదని డాక్టర్లు చెప్పారనుకోండి. అయినా తగ్గించే జబ్బు ద్దేముందండి. బంగారంలాంటి మందులున్నాయి.'

ఈ వాక్యం కాకముందే వచ్చిన వాళ్ళు ఊరు పొలిమేరలు దాటేవాళ్ళు! అతన్ని కాదన్న వాళ్ళందరికీ అదే గతి!

'అన్నట్టు బాబాయ్, ఆ సుందర్రావు కెలా పెళ్ళి చేసావ్' అన్నాను, విని ఆనందిద్దామని.

'అదా .. సుబ్రాడు కాలేజీలో పని చేస్తన్నాడు' అన్నాను. వెంకట్రామయ్య ఎగిరి గంతేసాడు.'

'అంత అబద్ధమా. తర్వాత తెలుసుకోలా

'పెళ్ళయ్యాక తెలుసుకున్నారు! నన్నడిగితే టుటోరియల్ కాలేజీ అంట గదా—మాట తేడా-నాకు ఇంగిలీసు రాదాయె అన్నానంతే.'

'ఊరుకున్నారా '

'ఉరెట్టు కుంటారా. . అన్నట్టు రేపోసారి సుందర్రావుని చూసి రావాల. మజ్జాన్నం బస్సుకి బయలు దేరు.'

'సుందర్రావునా - పెళ్ళయినవాడితో మన కెందుకు?'

'పనుందిలే బయలుదేరు ..'

నా మాట వినకుండా బ్రహ్మం గబగబా నడిచాడు.

కాలవలో నీళ్ళ పాముకొకటి కప్పని మింగేసింది!

* * *

రెండో రోజు భోజనాల్చేసి మధ్యాహ్నం బస్సెక్కాం.

బస్సు బయలు దేరింది. టిక్కెట్లు నేనే తీసుకున్నాను. బ్రహ్మం జేబులోనుండి బొగాకు బయటకు తీసాడు. గట్టిగా ఓ సారి వాసన పీల్చాడు. బస్సు సందడిలో మాటలు ఎవరికీ వినిపించవనుకున్న తర్వాత—

'చూడు బాబూ. నీ మరదలు అందమైన పిల్ల. అంపిరి పళ్ళా దాసమీదే, ఏమంటావ్-' మెల్లగా మాటల్లోకి దింపాడు.

'అనేదేముంది - వాస్తవమే గదా.'

'అవునా. తల్లీ తండ్రీలేని పిల్ల. నిన్నైదో పెంచి పెద్ద చేసావ్. ఇవ్వాళ దాని శీలంమీద

అపవాదొచ్చింది. తొందరగా వదిలిచ్చుకోవటం మంచిదయ్యా—'

'దానికోసమేగా బాబాయ్, ప్రయత్నం!'

'పెయత్నం అంటే చెంబులో చేపలుపట్టటం కాదు. నీ కూతుళ్ళు కూడా ఎక్కొస్తన్నారు చూసుకో—'

'నన్నేం చెయ్యమంటావ్.'

'రెండో పెళ్ళి వాడికిచ్చేయ్' చటుక్కున చెప్పాడు బ్రహ్మం!

'రెండో పెళ్ళా' గుండెల్లో గుభేలుమంది. పువ్వులాంటి పిల్లకు రెండో పెళ్ళా! అందాల నా మరదలుకు ముసిలి వెదవా . . బ్రహ్మం సముదాయించుతున్నట్టుగా మళ్ళీ అన్నాడు.

'బేజారెత్తి పోకు. పెళ్ళికొడుకు ముసలాడు కాదు. ఎవరితోనో తిరిగింది అనటం మొదటి పెళ్ళికంటే అన్యాయం. నా మాట విని సుంద రావు కిచ్చెయ్—'

బ్రహ్మం ఏం చెబుతున్నాడో అర్థంకాలేదు. మరుక్షణం విషంపెట్టి చంపెయ్-అంటాడేమో ననిపించింది! కాస్త తేరుకుని.

'సుందర్రావుకా?' అన్నాను.

'ఆఁ. సుందర్రావు కిచ్చిన వెంకట్రామయ్య కూతురు లక్షణమైన పిల్ల అనుకున్నావా - ఆ పిల్ల కాళ్ళల్లో రెండంగుళాలు ఎత్తు తేడా ఏడి సిందంట-మేమూ విషయం గమనించుకోలా-!

'అయితే—'

'ఎత్తు చెప్పులు తొడిగి లగ్గంలో నడిపిం చారు. ఇప్పుడు కుంటిపిల్ల నా కక్కర్లేదని సుందర్రావు విడాకులు పుచ్చుకున్నాడు.'

'ఆ నామీ మరి తెలివిగా పెళ్ళి చేసాం అన్నాడు—.

'తెలివి తెలిపేననుకో. పెళ్ళిళ్ళు జరిపించటం మన వృత్తి. మరి ఆ వృత్తిలో బ్రతికే వాళ్ళు ఇంకా వుంటారు. అలాంటి వాడెవడో వెంక ట్రామయ్యకు సాయం పట్టేసాడు.'

'అయితే సుందర్రావుకు లలిని నిమ్మం టారా-దీన్ని వదిలెయ్యడని నెమ్మది మేముంది?' విసురుగా అన్నాను.

'ఆవేశపడకు. రెండో పెళ్ళాన్ని ఎవరూ వదలడు. తిండికి లేకపోవొచ్చుగాని సుంద ర్రావు సినిమాల్లో బొమ్మలా వుంటాడు. నీ మరదలు ఒల్లు గలిగిన పిల్ల. ఆడు ఛస్తే వద లడు. జత బాగా సరిపోద్ది.'

'ఒద్దు బాబాయ్-దిక్కులేందాన్ని చేసి రెండో పెళ్ళి చేసానంటారు' బస్సు ఆపి దిగిపోదా మనిపించింది. బ్రహ్మానికి కోపమొచ్చింది.

'రెండో పెళ్ళి కాదు. నాలుగు రోజులలా వుంచితే నీకు రెండో పెళ్ళాం అంటారు. అందమైందని అట్టే పెట్టుకున్నాడంటారు. ఆ రోజు నీ పెళ్ళాం నీకూ, దానికీ కూడా ఇంత గంజి పోయదు-ఆలోచించుకో-'

బ్రహ్మం నామీద దివ్యాస్త్రం ప్రయో గించాడు. నాకు మాట రావటంలేదు. ఒళ్ళంతా జెర్రులు ప్రాకుతున్నాయి. బస్సు కుదిపి వేస్తుంది. బస్సులో దగ్గులు - తుమ్ములు - పసి పిల్లల కేకలు! కండక్టరు ఈలలు!

రెండో పెళ్ళి! రెండో పెళ్ళాం !టుటోరి యల్ కాలేజీ—కుంటిపిల్ల—విడాకులు బ్రహ్మం. పెళ్ళి . మోసం— దగా —పెళ్ళి అబద్ధం—అబద్ధమే పెళ్ళి .. గంజి ...గంజి... ఉంచుకోవటం లలిని ! అందమైన లలిని పెళ్ళాం రెండో పెళ్ళాం . .

నా బుర్రంతా కలవరంగా వుంది!

బ్రహ్మం మాత్రం ప్రశాంతంగా బయటకు చూస్తూ లెక్కలు వేసుకుంటున్నాడు.

'ఈ పెళ్ళి జరిగితే నేనిచ్చేదానికి, సుంద ర్రావు ఇస్తానన్నది కూడి మజ్జిగ ఖర్చు తీసే స్తున్నాడు. మళ్ళీ వెంకట్రామయ్య కూతురికి సంబంధం చూడాల. శివయ్య కొడుక్కి పెళ్ళి జరిపించమని కాళ్ళమీద పడ్డాడు. కుంటిపిల్లకు ఎత్తుచెప్పులు తొడిగి శివయ్య కొడుక్కి చుదెయ్యాల. వెంకట్రామయ్య ఇస్తానన్నదీ, శివయ్య ఇచ్చిందీ కూడిక. వచ్చిందాన్ని 'పుణ్యం'తో హెచ్చవేసి 'పాపంతో' భాగారిస్తు న్నాడు... !!' □